ప్రజాశక్తి
మంగళవారం 6 జూన్ 2023
8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

ఉత్సాహంగా కౌలు రైతుల రక్షణ యాత్ర

◆ మునగపాకలో ప్రారంభమై పలు గ్రామాల్లో సాగిన జాతా
◆ భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి -మునగపాక రూరల్, అచ్యుతాపురం, కశింకోట

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ 'కౌలు రైతుల రక్షణ యాత్ర' పేరిట సోమవారం నుంచి ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యాన తలపెట్టిన రాష్ట్ర జాతా అనకాపల్లి జిల్లాలోని మునగపాక మండల కేంద్రంలో ప్రారంభమైంది. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద సంఘం జెండా ఊపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు జాతాను ప్రారంభించారు. అనంతరం అచ్యుతాపురం, కశింకోట, యలమంచిలి మండలాల్లోని పేటకట్టు, తిమ్మరాజుపేట, పెదపాడు, ఖాజీపాలెం, తాళ్ళపాలెం వారపు సంత తదితర చోట్ల ఈ యాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లోని కౌలు రైతులతో యాత్రా బృందం సమావేశమైంది. కష్టాలు తెలుసుకుంది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ కౌలు రైతులు ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే చివరికి అప్పులే మిగులుతున్నాయన్నారు. గుర్తింపు కార్డులు లేకపోవడం వల్ల పంట రుణాలు, పంటల బీమా, రైతు భరోసా, పంట నష్ట పరిహారాలు అందకుండా పోతున్నాయన్నారు. కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో

తిమ్మరాజుపేటలో మాట్లాడుతున్న హరిబాబు

సంబంధం లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నూటికి 70 శాతం మంది కౌలు రైతులు వ్యవసాయాన్ని సాగు చేస్తున్నారని, కోటి మంది కౌలుపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, అధ్యక్షులు కాండ్రేగుల రాము, శరగడం రామునాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, సిఐటియు జిల్లా నాయకులు

హాజరైన కౌలు రైతులు

వివి.శ్రీనివాసరావు, ఆర్.రాము, ఎస్.బ్రహ్మాజీ, ప్రజా సంఘాల నాయకులు పెంటకోట అప్పారావు, టెక్కల పరదేశి నాయుడు, దాడి వీర నాయుడు, రమణ, నాగేశ్వరరావు, సూర్యనారాయణ, కె.రాంబాబు, ప్రజానాట్య మండలి కళాకారులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన అల్లం

◆ కిలో రూ.300
◆ కర్ణాటక, తమిళనాడు, కేరళల్లో తగ్గిన దిగుబడి
◆ మందగించిన దిగుమతులు
◆ విశాఖపై తీవ్ర ప్రభావం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

అల్లం ధరలు ఘాటెక్కాయి. నగర బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.300 పలుకుతోంది. గతంలో ఎప్పుడూ ఇంత ధర లేకపోవడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. రైతు బజార్లలో కిలో రూ.190 అంటూ బోర్డు మీద దీని ధర కనిపిస్తుంది. అయితే.. ఒకటి, రెండు మినహా మిగిలిన రైతు బజార్లలో అల్లం అమ్మకాలు జరగడం లేదు. అమ్ముతున్న రైతు బజార్లలో కూడా ఏ మాత్రమూ నాణ్యతలేని, కొనడానికి ఆసక్తి చూపలేని అల్లం విక్రయిస్తున్నారు.

దీంతో అల్లం సామాన్యుడు కొనలేని స్థితికి చేరుకుంది. ఉత్పత్తి, సరఫరా అంతరంతో ధరలు పైపైకి చేరుకుంటున్నాయి. ఒక వైపు శుభకార్యాలు, జాతరలు, మరోవైపు పచ్చళ్ల సీజన్ కావడంతో అల్లం వినియోగం పెరిగింది. డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడంతో నెల రోజుల్లో అల్లం ధరలు ఆకాశాన్నంటాయి. ఏప్రిల్‌లో కిలో రూ.150 ఉన్న ధర క్రమంగా పెరుగుతూ నేడు రూ.రూ.300కి చేరింది. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్న మిగతా 2లో..

ఘనంగా 'ఎకో-వైజాగ్' ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విశాఖ బీచ్‌రోడ్డులో జివిఎంసి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన 'ఎకో-వైజాగ్' కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పంచ సూత్రాలు అన్నట్టు ఐదు రకాలుగా విశాఖలో పచ్చదనం పెంపొందించేందుకు జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి హాజరయ్యారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలంటూ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆధ్వర్యంలో కాళికామాత గుడి నుంచి వైఎస్ఆర్ విగ్రహం వరకు చేపట్టిన ర్యాలీ విజయవంతమైంది. ఈ సందర్భంగా బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన జివిఎంసి స్టాళ్ల ప్రదర్శన మిగతా 2లో..

రెజ్లర్లకు ప్రజా సంఘాల మద్దతు

▶ వార్త 6లో..

విశాఖలో వైసిపి నేతల భూ దోపిడీ

▶ వార్త 2లో..

అనకాపల్లిలో అధికారుల బదిలీలు

▶ వార్త 6లో..

హెల్త్ సిటీలో బాధితులను పరామర్శిస్తున్న అమర్‌నాథ్, ఎంవివి.సత్యనారాయణ

బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - ఆరిలోవ, ఎంవిపి.కాలనీ

ఒడిశాలోని బాలాసోర్ వద్ద రైలు ప్రమాదంలో గాయపడి ఆరిలోవ హెల్త్‌సిటీలో చికిత్స పొందుతున్న బాధితులను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విశాఖ పార్లమెంటు సభ్యులు ఎంవివి. సత్యనారాయణతో కలిసి సోమవారం పరామర్శించారు. క్యూ వన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆరిలోవ టిఐసి పాయింట్‌కు చెందిన కె.అరుణ, కె.రాజులను పరామర్శించి రూ.1,25,000 చెక్కులను అందజేశారు. అలాగే అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన కె.పూజకు రూ.లక్ష చెక్కు అందించారు. జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, భీమిలి ఆర్‌డిఒ భాస్కర్ రెడ్డి, చినగదిలి తహశీల్దారు రమణయ్య, ఆరిలోవ సిఐ సోమశేఖర్, క్యూ వన్ ఆసుపత్రి అధినేత రమణమూర్తి, అపోలో సిఇఒ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు ఘన నివాళి

◆ ఆ ఘోర సంఘటనకు కేంద్రమే బాధ్యత వహించాలి
◆ బాధిత కుటుంబాలను ఆదుకోవాలి : ఐద్వా, సిఐటియు నేతల డిమాండ్

ఒడిశాలోని బాలాసోర్ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతిచెందిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఐద్వా, సిఐటియు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యాన సోమవారం కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ప్రమాద బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రైల్వేపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై మండిపడ్డారు.

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాలని, ప్రమాద కారణాలపై విచారించి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. రైలు ప్రమాద మృతులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం విశాఖ

విశాఖలో కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, తదితరులు

రైల్వేస్టేషన్ మెయిన్ గేటు వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సహా అత్యున్నత స్థాయికి చేరిన ఈ దశలో లూప్‌లైన్‌లోకి కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ వెళ్లడం రైల్వే శాఖ అశ్రద్ధను, ప్రమాణాలు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

తిమ్మరాజుపేట జంక్షన్‌లో కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న సుబ్బరావమ్మ తదితరులు

రైలు ప్రమాద మృతులకు ఘన నివాళి

పాటించకపోవడాన్ని తెలియజేస్తోందన్నారు. మరణించిన, క్షతగాత్రులైన వేల కుటుంబాలు ఆ బాధను భరించాల్సిన స్థితికి నెట్టబడ్డాయన్నారు. ప్రమాద బాధితులకు సిఐటియు, ఐద్వా కమిటీలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ ఘోర దురంతానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ బాధ్యత వహించాల్సి ఉందన్నారు. బుల్లెట్ రైళ్లు, వందే భారత్ లాంటి హై స్పీడ్ రైళ్లను ప్రవేశపెడుతున్నటువంటి ప్రభుత్వం తగిన భద్రతా చర్యలు కూడా చేపట్టాల్సి ఉందన్నారు. సామాన్య ప్రజలు, ప్రయాణికుల బాధలను పట్టించుకోకుండా రైల్వేలో కలవారి భోగాలకు ప్రాధాన్యతనివ్వడం పెరిగిందన్నారు. రైల్వేను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రైవేటీకరణ చేస్తున్నారని, సామాన్యుల ప్రాణాలను ఫణంగా పెడుతున్నారని విమర్శించారు. రైలు ప్రమాద బాధిత కుటుంబాలను సంపూర్ణంగా ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, కె.వేణు, సుమిత్ర, పుష్ప, భారతి, మాధురి, సిఐటియు నాయకులు పి.వెంకటరెడ్డి, ఎస్.జ్యోతీశ్వరరావు, సీత, పి.వెంకటరావు, క్యాబ్ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీరాములు, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ఎన్.రాజు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఎం.కామేశ్వరి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఒరిస్సాలోని బాలాసోర్ రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మండలంలోని తిమ్మరాజుపేట జంక్షన్‌లో కొవ్వొత్తులతో మానవహారం నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు సుబ్బారావమ్మ, బేబీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో మోడీ వచ్చిన తర్వాత రైల్వే ప్రైవేటీకరణ విధానాలు మరింత విస్తృతంగా జరగడం, 3 లక్షల వరకు రైల్వేలలో ఖాళీలు భర్తీకి చేయకపోవడం, ఒక్కొక్క విభాగాన్ని ప్రైవేటీకరించటం, ఉన్న ఉద్యోగులపై పని ఒత్తిడిగా మారడంతో ఈ ఘోర ఘటన జరిగిందని పేర్కొన్నారు. ఈ ప్రమాదానికి బిజెపి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఈ యొక్క ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని, రైల్వే ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలని, ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు నాయకులు ఆర్.రాము, కె.సోమునాయుడు, వీవీ శ్రీనివాసరావు, ఎస్ బ్రహ్మజీ, రంగారావు, ఉపాధ్యాయ నాయకులు అప్పారావు అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన అల్లం

అల్లం 50 కేజీల బస్తాను రూ.10 వేలకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అందులో నాలుగైదు కిలోల తరుగుపోతుందని వ్యాపారులు చెబుతున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.238కి అమ్ముతున్నారు. రైతు బజార్లలో 100 గ్రాములు రూ.30కి విక్రయిస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు కర్ణాటక, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల నుంచి అల్లం దిగుమతి అవుతోంది. ఈ రాష్ట్రాల్లో దిగుబడిలేక సరఫరా తగ్గడంతో ధర అమాంతం పెరిగిపోయింది. రోజుకు 25 నుంచి 30 టన్నుల సామర్థ్యమున్న మూడు లారీల సరుకు నగరంలో విక్రయమవుతోంది. కొంతకాలంగా ధర పెరుగుతుండటంతో మండే ఎండల ధాటికి సరుకు పాడైతే నష్టపోవాల్సి వస్తుందని కొందరు వ్యాపారులు దిగుమతిని తగ్గించారు. దీంతో వంటకాల్లో ఆచితూచి వాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వీధుల్లో ఉండే కూరగాయల దుకాణాలలో చాలా వరకూ అల్లం అమ్మకాలు నిలిపివేశారు. నెల రోజుల నుంచీ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ వేసవిలో ఆయా రాష్ట్రాల్లో పంట దిగుబడి లేకపోవడంతో డిమాండ్‌కు తగ్గ సరుకు లేక ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. మరో నెల రోజుల వరకూ అల్లం ధరలు ప్రియంగానే ఉంటాయని వారు చెబుతున్నారు.

టమాటా ధర పైపైకి

అల్లంతో పాటు టమాటా ధర కూడా పైపైకి ఎగబాకుతోంది. పది రోజుల క్రితం కిలో రూ.16గా రైతు బజార్లలో అమ్ముడైన టమాటా ఇప్పుడు రూ.29కి చేరింది. అలా అని రైతు బజార్లలో అన్నిచోట్లా టమాటా అమ్మకాలు గతంలో వలే విరివిగా లేవు. ఒక్కొక్క రైతు బజారులో ఒక రైతు మాత్రమే వీటి అమ్మకాలు చేస్తున్నారు. అవి కూడా నాణ్యంగా ఉండటం లేదు. బహిరంగ మార్కెట్‌లో రూ.40గా అమ్ముతున్నారు.

పాత ఈ-చలానాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆటో డ్రైవర్లపై ఉన్న పాత పోలీసు ఈ-చలానాలను రద్దు చేయాలంటూ దొండపర్తి శ్రీకన్య సినిమా హాలు జంక్షన్‌లో సోమవారం ఆటో డ్రైవర్ల ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడారు. రావి కృష్ణ పాల్గొన్నారు.

విశాఖలో వైసిపి నేతల భూ దోపిడీ

టిడిపి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరంలో వైసిపి నేతలు విచ్చలవిడిగా భూములు దోచుకున్నారని టిడిపి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. ఈ భూ దోపిడీ వ్యవహారంపై విజయసాయిరెడ్డి, రాష్ట్ర మంత్రులు సమాధానం చెప్పాలని సోమవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన డిమాండ్ చేశారు. సిరిపురం జంక్షన్ సిబిసిఎన్‌సి భూముల్లో జరుగుతున్న నిర్మాణ వివరాలు కావాలని సమాచార హక్కు చట్టం కింద కలెక్టర్ కార్యాలయంలో ఒక దరఖాస్తు, జివిఎంసి కార్యాలయంలో ఒక దరఖాస్తును తాను ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో భూములను వైసిపి నేతలు విచ్చలవిడిగా దోచుకున్నారని, వాటికి వివరణ ఇవ్వాల్సిన బాధ్యత అధికారులకు ఉందని అన్నారు. ఇచ్చిన అర్జీలకే దిక్కులేనపుడు జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమం దేనికని దుయ్యబట్టారు. సిరిపురంలో ఉన్న క్రిస్టియన్ సంస్థకు చెందిన సిబిసిఎన్‌సి భూముల్లో 18 వేల చదరపు గజాల స్థలంలో తవ్వకాలు దేనికని ప్రశ్నించారు. ప్రైవేటు వారికి అపార్టుమెంట్ కట్టడానికి ఎలా అనుమతులు ఇచ్చారో తెలియాల్సి ఉందన్నారు. భూ దోపిడీపై 30 రోజుల్లో సమాధానం రాకుంటే అప్పీల్ అథారిటీకి వెళతామని, అప్పటికీ ఇవ్వకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి పివిఎస్.నాయుడు, ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి జాన్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి పరిధిలో ఎన్విరాన్‌మెంట్ శానిటేషన్ సెక్రటరీలకు సచివాలయం టైమింగ్స్ అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆంధ్రప్రదేశ్ వార్డు సచివాలయ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా అధికారులకు స్పందనలో అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కె.పీటర్, జె.అహర్ని, ఎన్.పార్థసారధి మాట్లాడారు. వీరి పోరాటానికి ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పడాల రమణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ప్రసన్న, రూసీ రాణి, భాగ్యలక్ష్మి, లక్ష్మీదేవి, ఆడారి శివ, మంగరాజు, శివశంకర్, రమేష్ రాము, సుధీర్ పాల్గొన్నారు.

7న పోర్టు మెయిన్ గేటు వద్ద ధర్నా

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ పోర్టులో ఎటువంటి షరతులూ లేని వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలని యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. సోమవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేతన ఒప్పందంపై కార్మిక నష్టదాయకమైన సబ్ కమిటీ రిపోర్టును రద్దు చేయాలన్నారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 7న పోర్టు మెయిన్ గేటు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, విడిఎల్‌బి వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శులు, బి.లక్ష్మణరావు, గణేష్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఘనంగా 'ఎకో-వైజాగ్' ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి..)

కూడా ఆకట్టుకుంది. రూ.10 వేస్తే క్లాత్ బ్యాగ్ రావడం, ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేసిన షూలు, సీడ్‌బాల్స్ సహా పిచ్చుకల కోసం ఉంచిన బౌల్స్ వంటివి ఆకట్టుకున్నాయి. పర్యావరణ పరిరక్షణలో దేశ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉందని అధికారులు ప్రకటించగా, సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చొరవతో దానిని ఒకటో స్థానానికి తీసుకువచ్చేందుకు అంతా ప్రయత్నించాలని వైవి.సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. నగర మేయర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జివిఎంసి యంత్రాంగం ఎంతో కృషి చేస్తోందన్నారు. విశాఖలో కాలుష్య నియంత్రణ, తక్కువ మోతాదు కలిగిన ప్లాస్టిక్ విక్రయించేవారిపై నిఘా, పచ్చదనం పెంపు, నిబంధనలపై అవగాహన పెంచేందుకు జివిఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10 ప్రత్యేక వాహనాలను అతిథులు ఆవిష్కరించారు. అంతేకాకుండా భూగర్భ మురుగును వెలికి తీసేందుకు అత్యాధునిక సాంకేతికతతో ముంబయి తరహాలో ఇక్కడా ఓ వాహనాన్ని అందుబాటులోకి తెచ్చారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు పాకలపాటి రఘువర్మ, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఎకో - వైజాగ్ ప్రారంభ కార్యక్రమంలో వైవి.సుబ్బారెడ్డి, తదితరులు

కాలుష్య రహిత నగరంగా విశాఖ

కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉడా చిల్డ్రన్ ఎరీనా థియేటర్‌లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పర్యావరణ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని చిత్రలేఖనం లాంటి పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు సాధిక్, జాయింట్ చీఫ్ మేనేజ్‌మెంట్ ఇంజనీర్ ప్రసాదరావు, డాక్టర్ వరలక్ష్మి, వెంకట శేషమ్మ, ఆంధ్ర యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ ఇయబి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు వినతుల వెల్లువ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్ సోమవారం విశాఖ కలెక్టరేట్, జివిఎంసి ప్రధాన కార్యాలయాల్లో నిర్వహించిన స్పందనకు వినతులు వెల్లువెత్తాయి. కలెక్టరేట్‌లో 188, జివిఎంసిలో 106 విజ్ఞప్తులు అందాయి. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత కాల వ్యవధి లోపల ప్రజలు అందజేసిన వినతులకు పరిష్కారం చూపాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన వినతులను ఆయనతోపాటు జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ స్వీకరించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్, పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్ కుమార్, కార్యదర్శి నల్లనయ్య పాల్గొన్నారు. నగర పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన పోలీసు స్పందనకు 57 విజ్ఞప్తులు అందాయి.

LOST CERTIFICATES

I am **Jannela Prashanti** D/o J Prakash, has lost my file containing all my certificates i.e., SSC MARKS MEMO, INTERMEDIATE MARKS MEMO, DIPLOMA TRANSCRIPTS AND DIPLOMA TC, at Atchuthapuram bus stop when i came to attend an interview in Brandix company. If any one found the file please contact the below number.

Cell : **9182309985**

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT ANAKAPALLE
E.P. 31/2015 IN O.S.61/2014

Between:
Kandregula Ramudu ... Dhr
And:
Lopinti Srinivas ...JDr

వేలం ప్రకటన

పై నెంబరు దావా డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ఇందలి తాలూకా అమలు షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలం వేయించవలసిందిగా Dhr/వాది కోరుతూ పై అమలు గ్రంథమును దాఖలు చేయగా సుమారు అమలు గ్రంథము వేలం నిమిత్తం తే:21-06-2023దీని వాయిదా అయివున్నందున వేలం పాట యందు పాడుకొన దలచినవారు సదరు **తే:21-06-2023దీని ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టు వారి యెదుటకు హాజరై శ్రీకోర్టు వారు జరుపు బహిరంగవేలం పాట యందు పాల్గొని వేలం షరతులకు లోబడి పాడుకొనవచ్చును. ఇంకను యితర వివరములు కావలసిన యెడల పైకోర్టులో Deputy Nazzar వారి కార్యాలయములో గాని లేదా యీ దిగువ తెలిపిన Decree Holder యొక్క అడ్వకేట్‌గారి కార్యాలయములో గాని అడిగి తెలుసుకొన వచ్చును.

షెడ్యూల్ ఆస్తి వివరము

Anakapalli District – (previously Visakhapatnam District) - Anakapalle Sub Registry - Anakapalli mandal - Thummapala Panchayat limits – Thummapala village - Madhura nagar - RCC house with appurtenant site of an extent of 236.66 Sq. yards bearing D.No. 13/67, Plot No. 12 in survey no. 511/1A and bounded as follows:
East : Plot No.11
South : 20 feet Layout road
West : Plot No.13
North : Plot No.19
Measurements:
East to west : 35 ½ feet or 10.81 mts.,
North to south: 60 feet or 18.29 mts.,
D.H.R. Value Rs.3,00,000-00
Amin Value Rs.8,00,000-00
JDr Value : not given
LANKA JAGANNADHAM
LANKA PARVATEESWAR
Advocates, Anakapalli

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

పెదజాలారిపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో...

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని విశాఖ జిల్లాలో పలుచోట్ల సోమవారం ఘనంగా నిర్వహించారు. ర్యాలీలు, మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలు చేపట్టారు.

మధురవాడ : ఎన్జీవోస్ ఆధ్వర్యాన బీచ్‌లో స్వచ్ఛభారత్ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవ ప్రాముఖ్యతను ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు ఎస్.సత్యవేణి సంతోషి వివరించారు. ఈ కార్యక్రమంలో జగదీష్, అప్పారావు, అర్జున్ పాల్గొన్నారు.

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ పర్యావరణ శాస్త్ర విభాగం ఆధ్వర్యాన సంస్థ ఆవరణలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెవిజి.కృష్ణ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి, ఫిజియోథెరపి డైరెక్టర్ డాక్టర్ ఖాశీమాధురి మొక్కలు నాటారు. .

విశాఖపట్నం: పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యాన క్వీన్‌మేరీ పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. టిటిసి విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. 'ఇంటింటా మొక్కలు నాటుదాం.. ఊరంతా పచ్చదనం నింపుదాం' అంటూ నినదించారు. అనంతరం డ్రాయింగ్ విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. సుమారు 60 మంది విద్యార్థులు పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎసి మురళీమోహన్, ఇన్‌స్ట్రక్టర్లు రేజేటి కరుణాకర్, రవికుమార్, వెంకటరమణ, సుభద్ర, రామలక్ష్మి, ఉమ, సరస్వతి పాల్గొన్నారు.

భీమునిపట్నం : తగరపువలస, సంగివలస, అనిల్ నీరు కొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. కళాశాల ప్రిన్సిపల్ కె.రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.సూర్యనారాయణ పాల్గొన్నారు. స్థానిక ఎగువపేట పోలమాంబ ఆలయం ఆవరణలో స్థానిక యువకులు మొక్కలు నాటారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, కె.పైడిరాజు, శ్రీను, నాగేశ్వరరావు, అశోక్ పాల్గొన్నారు.

జివిఎంసి ఒకటో వార్డులోని బంగ్లా మెట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, బి.మల్లిక, పి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు, అధ్యక్షులు కెఎస్ఆర్.కృష్ణారావు ఆధ్వర్యాన పర్యావరణ పరిరక్షణపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు జరిగాయి.

స్థానిక ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం 1, 2, 3, జెకెసి ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహించారు. పోస్టర్ ప్రెజెంటేషన్, స్లోగన్ రైటింగ్ అంశాలపై పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల, డాక్టర్ సిహెచ్.జ్యోతి, డాక్టర్ ఎస్.నాయుడు, ఎస్.శ్రీను పాల్గొన్నారు

విశాఖపట్నం : పెదజాలారిపేట పట్టణ ఆరోగ్య, శిక్షణ కేంద్రంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యాన పర్యావరణంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విశాఖపట్నం శాఖ కోశాధికారి డాక్టర్ ఎంవివి.మురళీమోహన్ వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీ విద్యా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుష్మ, జివిఎంఎస్ఆర్ కమ్యూనిటీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీనివాస్, పోస్ట్ గ్రాడ్యుయేట్లు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ పరిధి బర్లపేటలో రూపాకుల రవికుమార్ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హంస మహేష్, బి.కనక, గంగరాజు, బి.నందిని, బి.సురేష్, పి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : అదాని గంగవరం పోర్టులో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. విశాఖ నగరంలోని పలు బజార్లలోని దుకాణాలకు జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. అదానీ గంగవరం పోర్టు అంతర్గత నర్సరీలో 1.5 లక్షల మొక్కలను సిద్ధం చేసిందని, వర్షాకాలం ప్రారంభంలో మొక్కలు నాటేందుకు మెగా డ్రైవ్ నిర్వహిస్తామని ప్రతినిధులు తెలిపారు.

మాధవధార : శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన విశాఖ బీచ్ క్లీనింగ్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, చారిటబుల్ ట్రస్ట్ అధినేత్రి కీర్తి పట్నాయక్ పాల్గొన్నారు.

సింహాచలం: అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహాలు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎ అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎపిఒ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామంలో సర్పంచ్ బావిశెట్టి భారతమ్మ కొబ్బరి, జామి తదితర మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది మరుపిళ్ళ చిన్నయ్యపాత్రుడు, గ్రామ కార్యదర్శి ఎస్.శివప్రసాద్, ఉప్పాడ అప్పారావు, కూరకుల వెంకటేష్, గుండు ఎల్లారావు, పోతిన వెంకటలక్ష్మి, బోని రామసత్యం, ఆకుల తాతారావు పాల్గొన్నారు.

ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతుప్రదర్శన శాల, జిల్లా అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యాన ర్యాడిసన్ బ్లూ హోటల్లో మీట్ ఫర్ ఎన్విరాన్ మెంట్ అంశంపై కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, డిఎఫ్ఒ అనంత్ శంకర్, క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా, అదనపు సెంట్రల్ టాక్స్ కమిషనర్ రవికిరణ్, ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. పర్యావరణ క్షీణతను తగ్గించడానికి అమలు చేయగలిగే పద్ధతుల గురించి చర్చించారు.

నక్కపల్లి : హెటిరో పైపులైన్‌కు వ్యతిరేకంగా శాంతియుత మహా ధర్నా చేపడుతున్న మత్స్యకారులు, సోమవారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు ఆధ్వర్యంలో కూడా ధర్నా శిబిరం వద్ద ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు కార్యక్రమంలో నాయకులు గోసల సోమేశ్వరరావు, చేపల సోమేష్, చొక్కా కాశీ, పిక్కి రమణ, మైలపల్లి శివాజీ, మైలపల్లి నరేష్, కొత్వాల్ కాశీ పాల్గొన్నారు.

స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఎంపిపి రత్నం, గొడిచెర్ల హైస్కూల్ ఆవరణలో మండల ప్రత్యేక అధికారి రమామణి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపిడిఒ సీతారామరాజు, ఎంఇఒ డివిడి ప్రసాద్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కొప్పిశెట్టి హరి పాల్గొన్నారు .

గొలుగొండ : కేడీపేట అల్లూరి పార్కులో అటవీశాఖాధికారుల ఆధ్వర్యంలో అనకాపల్లి ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి కె.శ్రీనివాసరావు, కొయ్యూరు సిఐ స్వామినాయుడు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కేడీపేట అటవీ రేంజ్ ఆఫీసర్ సుంకర వెంకటరావు, డిఆర్ఒ కెవి.రాజేష్, ఎస్ఐ ఉపేంద్ర, ఎఎంసి చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపిపి మణికుమారి, సర్పంచ్ లోచల సుజాత, ఎంపిటిసి చింతల బుల్లిప్రసాద్, సెక్షన్ అధికారులు లక్ష్మణ్, సుబ్బారావు, వైద్యాధికారులు గాయత్రి, హరిప్రవీణ్ పాల్గొన్నారు.

అనకాపల్లిలో మొక్కలు నాటుతున్న ఎంపీ సత్యవతి, కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ఎస్ రాయవరం : మండలంలోని సర్వసిద్ధి, పెనుగొల్లు పిహెచ్‌సిల వైద్యాధికారులు డాక్టర్ శక్తిప్రియ, డాక్టర్ వాసంతి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ టి.నాగేశ్వరరావు, మలేరియా ఇన్‌ఛార్జి నోడల్ ఆఫీసర్ పివిఎన్‌విఎస్ ప్రసాద్, పెనుగొల్లులో సూపర్‌వైజర్ సాయి, హెల్త్ వెల్నెస్ సెంటర్ పర్యవేక్షకులు షేక్ అమీర్ షాజిద్ ఎంఎల్‌హెచ్ జి ప్రమీలకుమారి, హెల్త్ సెక్రటరీ దాలియమ్మ, ఆశ వర్కర్ రాజ్యలక్ష్మి, అంగన్వాడి టీచర్ వై లక్ష్మి పాల్గొన్నారు. వెలుగు కార్యాలయంలో ఎపిఎం కె.శివ, సిసిలు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: స్థానిక ఐదు రోడ్ల జంక్షన్లోని శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ పి దమయంతి ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రభాకరరావు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత ఆవశ్యకతను వివరించారు. పిల్లలకు పర్యావరణ పరిరక్షణపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకరరావు పిల్లలకు బాస్కెట్‌బాల్ ఆటలు ఆడించారు.

రోలుగుంట : కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాజ్ మహమ్మద్ ఆధ్వర్యంలో రోలుగుంట పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్సై నాగకార్తీక్, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ పోర్టులో...

ఎంవిపి.కాలనీ : అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని విశాఖ పోర్టులో ఘనంగా నిర్వహించారు. పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోర్టు పరిపాలనా భవనంలో అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పోర్టు చీఫ్ విజిలెన్స్ అధికారి పిఎస్ఎల్.స్వామి, పర్యావరణ కమిటీ మెంబర్ బిఎల్.శాస్త్రి, చీఫ్ ఇంజినీర్ వేణు ప్రసాద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ : ఇస్కఫ్ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. నాగార్జున యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.బాల మోహన్‌దాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి, ఇస్కఫ్ అధ్యక్షులు జెవి.ప్రభాకర్ పాల్గొన్నారు.

అనకాపల్లి : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి సత్యవతి, కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి అన్నారు. ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా సోమవారం బొజ్జన్న కొండ ప్రాంగణంలో వారు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాండ్రేగుల విష్ణుమూర్తి, ట్రైనీ కలెక్టర్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ బీశెట్టి వరాహ సత్యవతి, డిఆర్వో వెంకటరమణ పాల్గొన్నారు.

స్థానిక ఎఎంఎఎల్ కళాశాల ఆవరణలో ఎన్‌సిసి ఆర్మీ, నేవీ విభాగాల ఆధ్వర్యంలో జిల్లా అటవీశాఖాధికారి పి.జ్యోతిర్మయి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్.మహేశ్వరరావు, కళాశాల, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లి ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ శ్రీనగ పరదేశమ్మ ఆలయ ప్రాంగణంలో వేప, ఉసిరి, జమ్మి మొక్కలను వాకర్స్ క్లబ్, అనకాపల్లి ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ వాకర్స్ సభ్యులు సంయుక్తంగా నాటారు. అనంతరం గుడ్డ సంచులను పంపిణీ చేశారు. వాకర్ క్లబ్ సభ్యులు డాక్టర్ డిడి.నాయుడు, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

పరవాడ : ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పరవాడ ఫార్మాసిటీ ఎమ్‌డి డాక్టర్ పిపి.లాల్‌కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం ఫార్మాసిటీ ఆవరణలో రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో విశాఖ ఫార్మసిటీ డైరెక్టర్ టి.ఈశ్వర్ రెడ్డి, ఆర్ఐఎల్ ఆపరేషన్ హెడ్ఎం చంద్రశేఖర్, రాంకీ కార్పొరేట్ అధికారి చక్రధర్ పాల్గొన్నారు. పరవాడ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో రేంజ్ ఆఫీసర్ ఉమామహేశ్వరి మొక్కలను నాటారు. ఎంపీడీవో హేమచంద్రరావు సిబ్బంది పాల్గొన్నారు

చోడవరం : మండలంలోని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో ఎమ్‌డి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ ఉద్యోగులు నాగేశ్వరరావు, రాము, యూనియన్ నాయకులు భాస్కరరావు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని అమృతపురం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ఎం.రామినాయుడు ఆధ్వర్యంలో ఎంఇఒ ఎస్.అప్పలరాజు మొక్కలను నాటారు. కార్యక్రమంలో సిఆర్‌పి ఆర్.రమణ, సచివాలయ ఇంజనీర్ డి.శ్రీనివాస్ పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు మొక్కలు నాటారు. మండల పరిషత్ పరిపాలన అధికారి షేక్ బాబురావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక మహిళ సమాఖ్య కార్యాలయం వద్ద ఏరియా కో-ఆర్డినేటర్ వి.ధర్మారావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపిఎం ఎస్.శ్రీనివాసరావు, ఎంఎంఎస్ అధ్యక్షులు కె.అరుణ, కార్యదర్శి లక్ష్మి, అప్పలనరసమ్మ శ్రీనివాసరావు, వెంకినాయుడు, సీసీలు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ దిమ్మల అప్పారావు, పిఎసిఎస్ ఆవరణలో అధ్యక్షులు కోనపల్లి రామ్మోహన్ రావు, వాడ్రాపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, అమృత్ సరోవర్‌లో ఎంపికైన నాగవరం ట్యాంక్ గట్టు పరిసరాలలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి మొక్కలు నాటారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది ప్రభుత్వం జూనియర్ కళాశాల వద్ద లోపూడి ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటారు. కార్యక్రమంలో జెడ్పిటిసి దొండా రాంబాబు, చోడవరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.గోరేష్, ఎఫ్ఎస్ఓలు మూర్తి, కళాశాల అధికారులు పాల్గొన్నారు.

విశాఖపట్నం : ప ర్యా వ ర ణ దినోత్సవంలో భాగంగా అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన ఆర్‌కె.బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు, గాజు, ప్లాస్టిక్ బాటిళ్లను గన్నీ బ్యాగులతో సేకరించి జివిఎంసి సిబ్బందికి అప్పగించారు. అనంతరం అడవివరం హైస్కూల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్వశిక్ష ఎపిసి బి.శ్రీనివాసరావు, 98వ వార్డు కార్పొరేటర్ నరసింహం, విశాఖ జిల్లా ఎపిఎన్‌జిఒ కోఆర్డినేటర్ సూరెడ్డి బాబూరావు, అమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు, వైస్ చైర్మన్ సింగంపల్లి అర్జున, సభ్యులు పాల్గొన్నారు.

క్వీన్ మేరీ పాఠశాలలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న టిటిసి విద్యార్థులు, ఉపాధ్యాయులు

క్వీన్ మేరీ పాఠశాలలో పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న టిటిసి విద్యార్థులు

నక్కపల్లిలో మొక్కలు నాటుతున్న అప్పలరాజు మత్స్యకారులు

సిఐటియు నాయకులు కన్నారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఇటీవల మరణించిన సిఐటియు సీనియర్ నాయకులు ఉప్పిలి కన్నారావుకు సిపిఎం, సిఐటియు విశాఖ, అనకాపల్లి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం అగనంపూడిలోని కన్నారావు స్వగృహంలో జరిగిన సంస్మరణ సభకు హాజరై విప్లవ వందనాలు అర్పించారు. సంస్మరణ సభలో 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, కార్పొరేట్ ఆసుపత్రుల ధనదాహానికి కన్నారావు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గుండెకు సంబంధించిన రక్త ప్రసరణ వ్యవస్థలో ఏర్పడిన లోపానికి సక్రమంగా వైద్యం చేయకుండా బలి తీసుకున్నారన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, ఉక్కు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే అసంఘటిత, సంఘటిత కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారని గుర్తుచేశారు. కన్నారావు మృతి సిపిఎం, సిఐటియుకు తీరని లోటన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ, అగనంపూడిలో పార్టీ బలోపేతానికి కన్నారావు చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆయన ఇంటినే పార్టీ కార్యాలయంగా మార్చి అనేక సభలు, సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలోనూ విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సిపిఎం, సిఐటియు తరపున అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం, స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్, పివిఎస్‌బి.శ్రీనివాసరాజు, నీలకంఠరావు, ఉరిటి మరిడయ్య, విడివి పూర్ణచంద్రరావు, గంగాధర్, డిసిహెచ్ వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు పూర్ణానందశర్మ, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంస్మరణ సభలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 74వ వార్డు పరిధి సిద్దేశ్వరం గ్రామం తోట వీధి ప్రాంతంలోని కమిటీ హాల్ ప్రహరీ నిర్మాణ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.11.22లక్షలతో ప్రహరీ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రతి వార్డులోనూ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. వంశీరెడ్డి మాట్లాడుతూ, వార్డులో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలను ఎమ్మెల్యే నాగిరెడ్డి నాలుగేళ్ల పాలనలో 90 శాతం పూర్తిచేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఇ ఎస్.వెంకటరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, వార్డు ముఖ్యనాయకులు ఎన్‌వై.నాయుడు, గోరుసు సత్యం, గొందేశి సత్యారావు, గొందేశి సత్తిరెడ్డి, పైడికొండ, బొడ్డు గోవిందా, నందిక తాతారావు, పిట్ట రెడ్డి, పుతి తాతారావు, ఇంద్రసేనారెడ్డి, చినరెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, గోరుసు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ స్కేటింగ్‌లో ప్రతిభ

ప్రజాశక్తి-పెందుర్తి : గుంటూరులోని బిఆర్.స్టేడియంలో ఈ నెల 3, 4 తేదీల్లో నిర్వహించిన స్పీడ్ స్కేటింగ్ పోటీలలో కేంద్రీయ విద్యాలయం-1 కృష్ణానగర్‌కు చెందిన విద్యార్థిని ఆర్.సరిత ఒక సిల్వర్ మెడల్, ఒక బ్రాంజ్ మెడల్ గెలుచుకొని సత్తా చాటింది. 93వ వార్డు పరిధి కృష్ణానగర్‌లోని ఐహెచ్‌ఆర్‌సి కార్యాలయంలో సరితకు ఐహెచ్‌ఆర్‌సి సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా ఐహెచ్‌ఆర్‌సి నేషనల్ చైర్మన్ ఆర్.ప్రసాదరావు మాట్లాడుతూ, మురళీ స్కేటింగ్ అకాడమీ నుంచి ఆర్.సరిత ఒక సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్, ఎస్.హితేష్ రెండు సిల్వర్, జి.నూతన్ రెండు సిల్వర్, వి.ఉదయశ్రీతేజ రెండు గోల్డ్, జి.జోసెఫ్‌రత్నాకర్ రెండు గోల్డ్ మెడల్స్ సాధించారని తెలిపారు. ఇంటర్నేషనల్ స్థాయిలో మురళీ స్కేటింగ్ అకాడమీ అనేక పతకాలు సాధిస్తోందన్నారు. నేషనల్ సెక్రెటరీ ఆర్.ఇషిత, మీడియా సెక్రెటరీ టి.రవికుమార్, ఆర్‌టిఐ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆఫీసర్ మధు జయరాజ్, ట్రెజరర్ ఆర్.విజయ, జాయింట్ సెక్రెటరీ ఆర్ రిషిత, విశాఖపట్నం ఆర్‌టిఎ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆఫీసర్ బి.రమేష్, జిల్లా ప్రెసిడెంట్ పి.హేమలత, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జ్యోతి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యకు వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి 4వ వార్డు కాపులుప్పాడ రెవెన్యూ పరిధి పాత పరదేశిపాలెంలో అక్రమ నిర్మాణాలపై చర్య తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేసినట్లు యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు సూరాడ నరసింగరావు తెలిపారు. 8.30 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంత మంది ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, ఇప్పటికీ కొన్ని అక్రమ నిర్మాణాలు జరుగుతూ ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం ఆక్రమించిన భూమి మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.20 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా వేసి ఒక్కో ప్లాట్‌ను రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. 12 నెలలుగా ఇలా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు గానీ, సచివాలయ సిబ్బంది గానీ పట్టించుకోలేదని విమర్శించారు. ఇదే విషయమై పలు మార్లు భీమిలి తహసీల్దార్‌కు, ఆర్డీవోకు వినతి పత్రాలు సమర్పించినా స్పందన లేదని వాపోయారు.

అప్పన్నను దర్శించిన నిర్మలానంద స్వామి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పనను ఆది చెంచునగిరి మహా సంస్థాన స్వామి డాక్టర్ నిర్మలానంద సోమవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు కనకరాజు, స్థానిక టిడిపి నాయకులు పాసర్ల ప్రసాద్, రమణ, భరత్ స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

కెరీర్ గైడెన్స్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని బంటుపల్లి వారి కల్లాల రోడ్డులో గల గాయత్రి డిగ్రీ కళాశాలలో జాబ్ ఓరియంటేషన్ ఇన్ కెరీర్ గైడెన్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వ్యక్తిత్వ వికాస నిపుణులు సంతోష్ కుమార్ మాట్లాడుతూ, 10వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్హత కలిగిన వారికి ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. డిగ్రీ కళాశాల డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి ప్రణాళికతో చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. ప్రిన్సిపల్ అప్పలరాజు మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనకు 6 అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము నిర్వహించిన స్పందనకు ఆరు అర్జీలు వచ్చాయి. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 3, ఇంజినీరింగ్, యుసిడి, రెవెన్యూ విభాగాలకు సంబంధించి చెరొక అర్జీ ఇచ్చారు.

బడ్డీల తొలగింపు యత్నాన్ని వెనక్కు తీసుకోవాలి

మాజీ కౌన్సిలర్ రమణ

చిరు వ్యాపారులతో కలిసి నిరసన తెలుపుతున్న రమణ

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎదురుగా భీమిలి రోడ్డు పక్కన ఏర్పాటుచేసుకున్న పలు బడ్డీల తొలగింపు యత్నాన్ని వెనక్కి తీసుకోవాలని మాజీ కౌన్సిలర్, వైసిపి నాయకులు జివి.రమణ అధికారులను డిమాండ్ చేశారు. బడ్డీలు తొలగించాలంటూ జివిఎంసి ఒకటో జోన్ అధికారులు సంబంధిత చిరు వ్యాపారులకు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ సోమవారం బడ్డీల వద్దనే బాధిత చిరు వ్యాపారులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొంత మంది పేదలు రోడ్డు పక్కన పకోడీ, మాంసం తదితర దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. చిరు వ్యాపారుల పొట్ట కొడితే ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు.

మృతునికి చికిత్స అంటూ ఆందోళన

ప్రజాశక్తి-సీతమ్మధార : గురుద్వార సమీపంలోని ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిలో మృతిచెందిన వ్యక్తికి వైద్యం పేరిట రూ.80 వేలు కట్టించుకున్నారంటూ మృతుని కుటుంబీకులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. దీనిపై మృతుని కుమారుడు మీడియాతో మాట్లాడుతూ, తమ తండ్రి వై.సత్యనారాయణ అనారోగ్యంతో పది రోజుల నుంచి ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. సోమవారం మృతిచెందిన తర్వాత కూడా ట్రీట్‌మెంట్ పేరుతో రూ.80 వేలు కట్టించుకున్నారని ఆరోపించారు. తన తండ్రి మృదేహాన్ని అప్పగించి కట్టిన అమౌంట్ తిరిగి ఇవ్వాలని డిమాండ్‌చేశారు. దీనిపై హాస్పిటల్ అడ్మిన్ కిరణ్‌ను వివరణ కోరగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆయన మరణించారని, చనిపోయిన తర్వాత ఎటువంటి ట్రీట్‌మెంటూ చేయలేదని తెలిపారు. బ్యాలెన్స్ అమౌంట్ కట్టకుండా ఉండడానికి ఈ విధంగా హడావిడి చేస్తున్నారని ఆయన ఆరోపిస్తున్నారు. పేషెంట్ బంధువులు హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడటంతో డబ్బులు కట్టకుండా మృతదేహాన్ని అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఆయన డబ్బులు కట్టినట్లు క్రెడిట్ అయితే ఆ అమౌంట్ ఇచ్చేస్తామని తెలిపారు.

షిప్‌యార్డు లే-అవుట్‌లో చల్లారని వివాదం

మంత్రి, ఎమ్మెల్యే అనుచరుల ఆగడాలంటూ ఆరోపణలు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 98వ వార్డు పరిధి షిప్‌యార్డు లే-అవుట్ సర్వే నంబర్ 164 /1ఎలోని స్థలంపై ఇరు గ్రూపుల మధ్య చెలరేగిన వివాదం రెండు రోజులుగా కొనసాగుతోంది. ఈ స్థల వివాదంలో భాగంగా ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి కొన్ని పశువులను చంపారు. దీనిపై ఒక గ్రూపునకు చెందిన డివి.మహేష్ మాట్లాడుతూ, ఈ స్థలం వివాదం వెనుక మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, సిఐ అప్పారావు హస్తముందని ఆరోపించారు. ఆదివారం సుమారు 200 మంది తమ స్థలంలోకి వచ్చి హడావిడి చేశారని తెలిపారు. ఎమ్మెల్యే, మంత్రి అనుచరులు కొంతమందితో రాయబారాలు కూడా పంపించారని తెలిపారు. ఈ స్థలంలో 11 సంవత్సరాలుగా తామే పొజిషన్లో ఉన్నామని, ఎదుటి వారి వద్ద ఏ ఆధారాలున్నాయో చూపిస్తే స్థలం వదిలి వెళ్తానని సవాల్ విసిరారు. తాములేని సమయంలో షెడ్లు కూల్చడం, పశువులను చంపడం తగదన్నారు. వివాద సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి ఇరు గ్రూపులకు చెందిన వ్యక్తులను చెదరగొట్టారు. కోర్టులో న్యాయం తేల్చుకోవాలని సూచించారు.

సాగునీటి కాలువ ఆక్రమణలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెం పంచాయతీ పరిధిలో ఉన్న పంట కాలువ ఆక్రమణలు తొలగించాలని సోమవారం స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ తోట శ్రీవల్లీకి గ్రామానికి చెందిన రైతులు బోని సూరినాయుడు, బోని రామకృష్ణ, బోని అప్పలనాయడు, జి.శ్రీను వినతిపత్రం అందించారు. భాందేవుపురం రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 244లోని మలికిమాని చెరువులోకి పెద్ద కాలువ నుంచి వృథా నీరు వచ్చి చేరుతుందని తెలిపారు. ఈ కాలువ పూర్తిగా పూడుకుపోయిందని, పూడికలు తొలగించాడానికి మండల పరిషత్ నిధులతో నీటిపారుదలశాఖ చర్యలు చేపట్టిందని వివరించారు. ఈ కాలువను కొంత మంది ఆక్రమించారని, దీని వల్ల ఎటా పంటను నష్టపోతున్నామని వివరించారు. వేసవిలో కాలువ పూడికతీతకు, అక్రమణల తొలగింపునకు వీలుగా ఉంటుందని, ఈ సమయంలో చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు.

కారు, బైక్ ఢీకొని ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-సీతమ్మధార : కారు, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతిచెందారు. నాలుగోపట్టణ పోలీసుల కథనం ప్రకారం... కైలాసపురం ప్రాంతానికి చెందిన తేజ (20), సిహెచ్.వినయ్ (20) ఎన్‌ఎడి వైపు నుంచి కైలాసపురం వస్తున్నారు. తాటిపాలెం సిగ్నల్ పాయింట్ వద్ద కారు, వీరి ద్విచక్రవాహనం ఢీకున్నాయి. ఈ ప్రమాదంలో తేజ అక్కడికక్కడే మృతి చెందాడు. వినయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తేజ భార్య పరమజ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ప్రమీల దర్యాప్తు చేస్తున్నారు. కారు డ్రైవింగ్ చేస్తున్న రామారావును అదుపులో తీసుకున్నారు. తేజకు వివాహమై మూడు నెలలే అయింది.

ఒఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ప్రజాశక్తి- భీమునిపట్నం : తాళ్లవలస పిహెచ్‌సి ఆధ్వర్యాన మండలంలోని అంగన్వాడీ కేంద్రాలు, హెల్త్ వెల్ నెస్ కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో సోమవారం వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఒఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. డయేరియా వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. వ్యాధి వ్యాపిస్తే తీసుకోవాల్సిన ప్రాథమిక వైద్యంపై సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎబి.మల్లికార్జునరావు, డాక్టర్ బి.శోభారాణి, డాక్టర్ సందీప్, ఎంపిహెచ్ఇఒ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో ఆక్రమణలను తొలగించినట్లు తహశీల్దార్ తోట శ్రీవల్లీ తెలిపారు. పాండ్రంగి పంచాయతీ పరిధి సర్వే నెంబర్ 317లోని ప్రభుత్వ భూమి రెండున్నర సెంట్లలో ఆ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇల్లు నిర్మించారని స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు తొలగించామని తెలిపారు. కృష్ణాపురం గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 1లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన ప్రహరీని తొలగించామని చెప్పారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : మిధిలాపురి ఉడాకాలనీ 11కెవి ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్ 3 డిఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఎన్‌జిఒ, చంద్రంపాలెం, సుద్దగెడ్డ ఏరియా, వాంబేకాలనీ, పోర్టు కాలనీ, శ్రీనివాస్‌నగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎన్‌టిపిసిలో ఘనంగా పర్యావరణ దినోత్సవం

మొక్కలు నాటుతున్న ఎన్‌టిపిసి సింహాద్రి అధికారులు

ప్రజాశక్తి - పరవాడ

ఎన్టిపిసి సింహాద్రిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని మిషన్ లైఫ్‌తో కలిసి సోమవారం ఘనంగా నిర్వహించారు. సింహాద్రి జిజిఎమ్ సంజయ్ కుమార్ సిన్హా ప్రతిజ్ఞ చేయించారు. జిఎమ్ డిపి పాత్ర సందేశాన్ని చదివి వినిపించారు. హరితహారంపై అవగాహన పాదయాత్ర నిర్వహించారు. జిఎమ్‌లు, దీపాంజలి నగర్ వాసులు, జిఇఎమ్ పిల్లలు, సిఐఎస్‌ఎఫ్, ఇతర సహచరులు హరిత నడక, సామూహిక చెట్ల పెంపకంలో ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జియో పాలిమర్ కాంక్రీట్ (జిపిసి) నిర్మించిన యాష్ ట్రక్ పార్కింగ్ యార్డ్‌ను జిజిఎం సింహాద్రి సంజయ్ కుమార్ సిన్హాతో పాటు సిజిఎం(యుఎస్‌ఎస్‌సి), గోవింద్ రాజన్ ఇతర సీనియర్ అధికారులు ప్రారంభించారు.

వి సెజ్‌లో..

ఎంవిపి.కాలనీ : విశాఖ స్పెషల్ ఎకనామిక్ జోన్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వి సెజ్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పల పర్యావరణ పరిరక్షణ కాంక్షిస్తూ మొక్కలు నాటారు. అన్ని విభాగాల్లో మొక్కలు నాటాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెజ్‌లోని పలు విభాగాల అధిపతులు, యూనిట్ల ప్రతినిధులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న వి సెజ్ అధికారులు

వాక్‌థాన్ నిర్వహిస్తున్న హెచ్‌పిసిఎల్ అధికారులు

హెచ్‌పిసిఎల్ ఆధ్వర్యాన వాక్‌థాన్

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్‌పిసిఎల్ ఆధ్వర్యాన ఆర్‌కె బీచ్‌లో వాక్‌థాన్ నిర్వహించారు. మొక్కలు పంపిణీ చేశారు. బీచ్ క్లీనింగ్ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌పిసిఎల్ విఆర్‌ఎంపి ఇడి పి.వీరభద్రరావు మాట్లాడారు. మెరుగైన వాతావరణాన్ని భవిష్యత్తు తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు సి.మురళీకృష్ణ, ఎస్‌కె.ఝా, బివివి.రాజు, పి.బాలకృష్ణన్, డిజిఎం, ఎ.సుందరవదన్, సంస్థ ఉద్యోగులు, హెచ్‌పి గ్యాస్ పంపిణీదారులు కుటుంబాలతో సహా పాల్గొన్నారు.

స్థలం మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎంపీ, కేంద్రీయ విద్యాలయ అధికారులు

కేంద్రీయ విద్యాలయం స్థల పరిశీలన

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి కేంద్రీయ విద్యాలయానికి మండలంలోని సుందరయ్యపేటలో కేటాయించిన స్థలాన్ని సోమవారం అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, కేంద్రీయ విద్యాలయ డిప్యూటీ కమిషనర్ మంజునాథం పరిశీంచారు. ఈ సందర్భంగా స్థలం హద్దులను పరిశీలించి భవనం నిర్మించడానికి కావలసిన అధికారిక ఉత్తర్వులను తయారు చేసి త్వరలో సీపీడబ్ల్యూ అధికారులకు అందజేయడం జరిగిందన్నారు. త్వరలో నిర్మాణం పనులు అప్పజెప్పడం జరుగుతుందని ఎంపీ సత్యవతి పేర్కొన్నారు. అనంతరం ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో గంగాధర్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆదిశేషు శర్మ, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎంపిడిఒగా రవికుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -కశింకోట

కశింకోట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వివి రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రవికుమార్ శ్రీకాకుళం జిల్లాలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ప్రస్తుతం ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా పని చేస్తున్న కొంకి అప్పారావు బదిలీపై కాకినాడ ఎంపిడిఒగా వెళ్లారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి సహకారం అందించి అందరినీ సమన్వయంతో నడిపించడం జరుగుతుందని తెలిపారు.

చౌడువాడ పశువైద్యాధికారిగా మౌనిక

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని చౌడువాడ పశు వైద్య శాఖ వైద్య అధికారిగా డాక్టర్ సి.బాలమౌనిక సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె అన్నమయ్య జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై విచ్చేశారు. ఈ ఆసుపత్రిలో పూర్తికాల వైద్యులు కొంతకాలం నుంచి లేకపోవడంతో కొరువాడ పశు వైద్య అధికారి ఎర్రి నాయుడు ఇన్చార్జి బాధ్యతలు ఇంతవరకు నిర్వహిస్తున్నారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి రైతుల పశువులకు కావలసిన వైద్యంతోపాటు సూచనలు సలహాలు అందజేస్తామని చెప్పారు. ఈ ఆస్పత్రికి పూర్తి కాల వైద్యాధికారిని నియమించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు సమస్యల ఏకరువు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సోమవారం మండలంలోని రాజాంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం సమస్యల పరిష్కరించాలని ఎమ్మెల్యేకి స్థానిక ప్రజలు ఏకరువు పెట్టారు. ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించడమే గడపగడపకు లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి దొండా రాంబాబు, వైసీపీ నేత కె.అచ్చెంనాయుడు, సర్పంచ్ మరిసా నాని, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చెక్కు అందజేస్తున్న ముత్యాల సతీష్

మరిడిమాంబ ఆలయానికి విరాళం

ప్రజాశక్తి-చోడవరం

మండలంలో బెన్నవోలు గ్రామంలో నిర్మిస్తున్న మరిడిమాంబ ఆలయానికి ప్రముఖ పారిశ్రామిక వేత్త ముత్యాల వెంకటేశ్వరరావు కుమారుడు సతీష్ రూ.1.50 లక్షలు విరాళాన్ని అందించారు. చెక్కును మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాజీ సర్పంచ్ మజ్జి గౌరీ శంకర్‌కు సోమవారం అందజేశారు. అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో వివిధ కార్యక్రమాలకు ముత్యాల వెంకటేశ్వరరావు విరాళాల అందిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరిన్ని గ్రామాలకు సహాయ సహకారాలు అందుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తనయుడు సతీష్ తెలిపారు.

నా భూములన్నీ సమగ్ర సర్వేలో నమోదు చేయండి

- 91 ఏళ్ల వృద్ధుడు దరఖాస్తు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో తనకున్న భూములన్నీ సమగ్ర సర్వే పాస్ పుస్తకంలో నమోదు చేయాలని 91 సంవత్సరాలు వయసు కలిగిన శరగడం పరశురాము మండల తహశీల్దారు కార్యాలయంలో సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్వే నెంబరు 247, 248, 158బిబి, 85 నెంబర్లలో ఉన్న భూమి కొత్త పాసు పుస్తకంలో నమోదు చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన అనుమతి లేకుండా సర్వే నెంబరు 85లో ఉన్న 15 సెంట్లు భూమిని తన కుమారుని పేరు మీద రాయడాన్ని ఆయన వ్యతిరేకించారు. ఈ విషయాలపై గ్రామ సర్వేయర్ ను సంప్రదించగా రెండోసారి వచ్చే పుస్తకంలో వస్తాయని చెబుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పైన తెలిపిన సర్వే నెంబర్లలో తనకు గల భూమి తన పేరు మీద పాస్ పుస్తకంలో నమోదు చేసి ఇప్పించవలసిందిగా తహశీల్దారును కోరారు.

రాంకీ యాజమాన్యం అక్రమంగా తవ్విన

చెరువును మూసివేయాలని ఆందోళన

ప్రజాశక్తి-పరవాడ

చెరువు వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు నేత గనిశెట్టి, స్థానిక రైతులు

మండలంలో తానాం పక్కన ఫార్మాసిటీ రాంకీ యాజమాన్యం అక్రమంగా తవ్విన చెరువును మూసివేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో చెరువు వద్ద సోమవారం స్థానికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రాంకీ యాజమాన్యం పర్యావరణాన్ని నాశనం చేస్తూ గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో చెరువు తవ్వి ఫార్మా వ్యర్థ రసాయనాలను నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రయత్నం చేసిందని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా ఆందోళన చేయడంతో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఆ చెరువును నిలిపివేశారని పేర్కొన్నారు. రాంకీ యాజమాన్యం దొంగచాటుగా కాలువలు తవ్వి చుట్టూ ఉన్న చెరువుల్లో వ్యర్థ రసాయలను విడిచిపెడుతుందని, మూసివేయాల్సిన చెరువులో రసాయలను వదిలేస్తుందని విమర్శించారు. దీనివల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయన్నారు. కాలుష్యం నుంచి చుట్టూ ఉన్న గ్రామాలను కాపాడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు వి సన్యాసిరావు, నర్సింగరావు, అప్పారావు, కన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు

ప్రజా సంఘాల కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- మునగపాక రూరల్

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న హరిబాబు

మండల కేంద్రం మునగపాక మెయిన్ రోడ్డులోని ఎర్ర వెంకయ్యగారి వీధిలో రైతు, కౌలు రైతు, కార్మిక, ప్రజాసంఘాల కార్యాలయాన్ని సోమవారం ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు ప్రారంభించారు. కార్యాలయంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాట కేంద్రాలుగా ప్రజాసంఘాల కార్యాలయాలు పనిచేస్తున్నాయని తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి అక్కడ ప్రజాసంఘాలు ప్రధాన భూమిక పోషించాయని, అదే స్ఫూర్తితో ప్రజాసంఘాలు పనిచేయడం ద్వారా తమ హక్కులను సాధించుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జిల్లా నాయకులు ఎ.బాలకృష్ణ, వివి శ్రీనివాసరావు, ఆళ్ల మహేశ్వరరావు, ఎస్.బ్రహ్మాజీ, కాంద్రేగుల రాము, టెక్కలి జగ్గారావు, కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బొండా అప్పారావుకు నివాళి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని భరణికం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు కీర్తిశేషులు బొండా అప్పారావు మాస్టారు చిత్రపటానికి మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి, పైల జగన్నాథరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా, మాజీ సర్పంచ్ బొండా తాతారావు, బొండా సన్ని దేముడు, ధాట్ల గణేశ్ రాజు, ఇందల కొండల రావు, జాజుల చిన్నారావు, పెదిశెట్టి రామారావు, పెదిశెట్టి సత్యారావు, కుటుంబీకులు పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లాలో అధికారుల బదిలీలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని పది మంది తహశీల్దార్లు, పది మంది డిప్యూటీ తహశీల్దార్లను బదిలీ చేస్తూ నోడల్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ మల్లికార్జునరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ తహశీల్దార్లు ఎం.శాంతిభూషన్, ఎస్.వరహాలు, ఆర్.వెంకట మురళీధరరావు, వి.శేషుబాబు, ఎస్.నరేంద్రబాబు, ఎన్.రవికాంత్, జి.గణపతిరావు, హెచ్.త్రివేణి, ఎంఎస్ అరుణ్‌కుమార్, ఎస్.సత్యవతికి స్థానచలనం కలిగింది.

తహశీల్దార్ల బదిలీ వివరాలు

పేరు	ప్రస్తుతస్థానం	బదిలీస్థానం
1.సిహెచ్ చంద్రశేఖర రావు	సూపరింటెండెంట్, కలెక్టరేట్,	పరిపాలనాధికారి, ఆర్‌డిఓ కార్యాలయం, అనకాపల్లి
2.ఎ.శ్రీనివాసరావు,	అనకాపల్లి తహశీల్దార్,	సూపరింటెండెంట్, కలెక్టరేట్, అనకాపల్లి
3.వైఎస్‌వివి ప్రసాదరావు,	కోటవురట్ల తహశీల్దార్,	గొలుగొండ తహశీల్దార్
4.పివిఎల్‌ఎన్ గంగాధరరావు,	పరిపాలనాధికారి, ఆర్‌డిఓ కార్యాలయం, అనకాపల్లి	అనకాపల్లి తహశీల్దార్
5.పి.కనకారావు,	నాతవరం తహశీల్దార్,	పరవాడ తహశీల్దార్
6.వి.ప్రకాశరావు,	పరవాడ తహశీల్దార్,	మునగపాక తహశీల్దార్
7.ఎస్‌వి అంబేద్కర్,	బుచ్చెయ్యపేట తహశీల్దార్,	నక్కపల్లి తహశీల్దార్
8.కె.వెంకటేశ్వరరావు,	రోలుగుంట తహశీల్దార్,	బుచ్చెయ్యపేట తహశీల్దార్
9.ఎస్.జానకమ్మ,	తహశీల్దార్, అల్లూరి జిల్లా,	కోటవురట్ల తహశీల్దార్
10.జె.తారకేశ్వరి,	భూ సేకరణ విభాగం, ఆర్‌డిఓకార్యాలయం, విశాఖపట్నం	రోలుగుంట తహశీల్దార్

తహశీల్దారుగా కనకారావు

మునగపాకకు ప్రకాష్‌రావు బదిలీ

కనకారావు

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండల నూతన తహశీల్దార్‌గా పి.కనకారావును నియమిస్తూ నోడల్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కనకారావు ప్రస్తుతం నాతవరం తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సాధారణ బదిలీలలో భాగంగా ఆయన పరవాడ బదిలీపై వస్తున్నారు. ఇప్పటి వరకు పరవాడ తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న వి.ప్రకాష్‌రావును మునగపాక తహశీల్దార్‌గా బదిలీ చేశారు. ప్రకాష్‌రావు పరవాడ మండల తహశీల్దారుగా వచ్చి ఒక సంవత్సరం కూడా పూర్తి కాకపోయినా ఆయనపై పలు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా గెడ్డలు, వాగులు కబ్జాల విషయంలో ఆయన ఎటువంటి చర్యలు తీసుకోలేదని, పైగా కబ్జాదారులతో కుమ్మక్కై, వారికి సహకరించారన్న విమర్శలున్నాయి. ఈ కబ్జాలపై ప్రజాశక్తి ప్రచురించిన కథనాల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులను ఆయన్ను మందించినట్లు తెలిసింది. ఆ కారణంగానే ఆయన్ను బదిలీ చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

జగన్ అసమర్థ పాలన వల్లే విద్యుత్ కోతలు

ప్రజాశక్తి- అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అసమర్ధ పాలన వల్లే విద్యుత్తు కోతలు, విద్యుత్ ధరల పెంపు జరుగుతోందని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గృహాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు దారుణమని, దీని వల్ల ఒక్కో కుటుంబంపై నెలకు రూ.102 భారం పడుతుందని పేర్కొన్నారు. గడిచిన నాలుగు ఏళ్లలో వైసిపి ప్రభుత్వం 8సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందన్నారు. టీడీపి అధికారంలోకి రాగానే విద్యుత్ ఛార్జీలు నియంత్రిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పచ్చికూర రాము, నందారపు సూరిబాబు, జెట్టి అప్పారావు, గంటా సత్య రామకృష్ణ, సోమిరెడ్డి నాగరాజు, గంటా నాయుడు, సన్ని, భారత్, నందారపు సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు అఖిలపక్షం సంతాపం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఒడిశా రాష్ట్రంలో జరిగిన ఘోర రైల్వే ప్రమాదంలో మృతి చెందిన వారికి అనకాపల్లి అఖిలపక్ష పార్టీలు సంతాపం తెలియజేశాయి. స్థానిక సిపిఐ కార్యాలయంలో సోమవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో మృతి చెందిన వారికి ముందుగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు చొప్పున, తీవ్ర అవయలోపానికి గురైన వారికి రూ.50 లక్షలు, గాయాలపాలయిన వారికి రూ.25 లక్షలు చొప్పున ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రులకు మరింత మెరుగైన వైద్య సహాయం అందించాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘోర ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు సూదికొండ మాణిక్యాలరావు, ఆప్ నేత కొణతాల హరినాథ్ బాబు, సిపిఐ నాయకులు కోరిబిల్లి శంకర్రావు, కోన లక్ష్మణ్, నరాలశెట్టి సత్యనారాయణ, మత్తుర్తి సూరిబాబు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో వ్యాధులు నయం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఫిజియోథెరపీ ద్వారా నరాల బలహీనతను తగ్గించవచ్చని, ముఖం కదలికలు, నొప్పి, మోచేతులు, కాళ్ళు పీకును నయం చేసుకోవచ్చని ఫిజియోథెరపీ వైద్యులు కాండ్రేగుల వెంకటేష్ సింహాచలం నాయుడు అన్నారు. స్థానిక వివి రమణ రైతు భారతి ఆడిటోరియంలో సోమవారం వయోవృద్ధుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిపి, షుగర్ వంటి వ్యాధులు వాకింగు చేస్తే తగ్గుముఖం పడతాయన్నారు. ప్రతిఒకరు ప్లాస్టిక్ వాడుకం తగ్గించాలని జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ లీగల్ ఆడ్వేజరు డాక్టర్ శరగడం నూకరాజు సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు భీశెట్టి కృష్ణ అప్పారావు, కాండ్రేగుల అప్పారావు, డాక్టర్ బుద్ద అప్పారావు, డాక్టర్ శరగడం నూకరాజు, యమ్‌యన్‌యస్ అప్పారావు, కొణతాల నారాయణరావు, కర్రి జగ్గప్పారావు, కొణతాల సూరిఅప్పారావు, విల్లూరి కోటేశ్వరరావు, కాండ్రేగుల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఆవుకు అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం కొమ్మలపూడి గ్రామనికి చెందిన శెట్టి త్రిమూర్తులు ఆవుకు ఆరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఆవు గత కొద్ది రోజుల నుండి మేత మేయకపోవడం, కడుపు ఉబ్బడం, నీరసంగా ఉంటుంది. ఇది గమంచిన రైతు వడ్డాది పశు వైద్యాధికారి శివ కుమార్‌కు తెలియజేశారు. ఆయన ఆవుని పరీక్ష చేసి కడుపులో ఏదో ఉందని గమనించి వెంటనే ఆపరేషన్ చేయాలని సూచించారు. శస్త్ర చికిత్స చేసి సుమారుగా 30 కేజీల ప్లాస్టిక్ తాళ్లు, ప్లాస్టిక్ కవరలు కడుపునుండి తొలగించారు. ఈ శస్త్ర చికిత్సలో వడ్డాది పశు వైద్యధికారి డాక్టర్ శివకుమార్, రోలుగుంట పశు వైద్యధికారి డాక్టర్ నూకేష్, కొమ్మల్లపూడి పశు వైద్య సహాయకుడు కన్నం నాయుడు, లోపూడి పశు సహాయకులు సాయి కృష్ణ పాల్గొన్నారు.

నేడు ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై చర్చా వేదిక

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుపై అనకాపల్లి రోటరీ క్లబ్‌లో మంగళవారం చర్చా వేదిక జరుగుతుందని, దీనికి మండలానికి చెందిన రైతులు, సిపిఐ కార్యకర్తలు తరలిరావాలని సిపిఐ మండల కార్యదర్శి గోర్లె దేవుడు బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టు పూర్తి కాలేదన్నారు. సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత తాగు, సాగునీటికి ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. ఈ చర్చా వేదికలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సాధన కమిటీ సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

రెజ్లర్లకు ప్రజా సంఘాల మద్దతు

ప్రజాశక్తి - కలెక్టరేట్

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను పదవి నుంచి తొలగించాలని, తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సాయంత్రం ఐద్వా, డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో ఎం.సుబ్బారావు అధ్యక్షతన పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ టెంపుల్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఢిల్లీలోని రెజ్లర్ల పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు అన్నపూర్ణ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం వచ్చిన తరువాత మహిళలపై లైంగిక వేధింపులు పెరిగాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కె.సంతోష్ కుమార్, సిఐటియు నాయకులు కెవిపి చంద్రమౌళి, మహిళా సంఘం నాయకులు కె.వరలక్ష్మి, విజయ, పార్వతి, ముఠా యూనియన్ నాయకులు పైడిరాజు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రమాదంలో గాయపడిన స్నేహితునికి ఆర్థిక సాయం

బాధితుడిని ఆసుపత్రిలో కలిసిన స్నేహితులు

ప్రజాశక్తి - కె.కోటపాడు

ప్రమాదంలో గాయపడిన యువకునికి తోటి స్నేహితులు లక్షా 70 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని కె.సంతపాలెం గ్రామానికి చెందిన బర్ల దేవుడు నాయుడు వారం రోజుల క్రితం తన స్నేహితులతో కలిసి తాటి ముంజుల కొరకు వెళ్లాడు. తాటిచెట్టు ఎక్కి తాటి కాయలు కోస్తుండగా దేవుడు నాయుడు ప్రమాదవశాత్తు కిందన పడిపోవడంతో బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్నేహితులు విశాఖపట్నంలో ప్రైవేట్ హాస్పిటల్లో చేర్పించి దేవుడు నాయుడుకు సర్జరీ చేయించారు. దీనికి రూ.4.50 లక్షల వరకు ఖర్చు అయింది. దేవుడినాయుడు పేదవాడు. దీనికి తోడు తల్లిదండ్రులు, అన్నదమ్ములు ఎవరూ లేరు. ఆయన ఒంటరిగా జీవన సాగిస్తున్నారు. దీంతో గ్రామానికి చెందిన యువత తన మిత్రుని ఆదుకోవాలని దృకృథంతో లక్ష 70 వేల రూపాయలు విరాళంగా సేకరించి సోమవారం అతను చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో చుక్క రమణ, చుక్క నారాయణ మూర్తి, లక్ష్మణరావు, మహేష్, అప్పారావు, రావాడ శివప్రసాద్ రావు పాల్గొన్నారు

జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9న నిర్వహించే జాబ్ మేళా కార్యక్రమానికి సంబంధించి గోడ పత్రికను జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి సోమవారం కలెక్టరేట్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని అర్హత గల విద్యార్థులందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రాజ్, డిఆర్‌వో వెంకటరమణ, స్కిల్ డెవలప్మెంట్ అధికారి చాముండేశ్వరరావు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి, ఇతర అధికారులు

వాహనం బోల్తా

- పగిలిపోయిన 200 బీరు బాటిళ్లు

- రూ.5.80 లక్షలు నష్టం

ప్రజాశక్తి -కశింకోట

కశింకోట మండలం బయ్యవరం రైల్వే బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై సోమవారం బీరు సీసాలు తరలిస్తున్న బలోరా వాహనం బోల్తా పడింది. అనకాపల్లి నుండి నర్సీపట్నం బీరు సీసాలు తీసుకెళ్తున్న బలోరా వాహనం బయ్యవరం బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి వెనుక వచ్చిన వాహనం దాన్ని ఢీకొట్టింది. దీంతో బలోరా వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బలోరా వాహనంలో సుమారు 20 కేసులతో ఉన్న 200 బీరు బాటిళ్లురోడ్డు మీద పడి పగిలిపోయాయి. దీంతో రూ.5.80 లక్షలు నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో ఈ మార్గంలో కొంత సమయం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కశింకోట ఎస్ఐ ఆదినారాయణ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో 'జనవాణి'

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : రానున్న ఎన్నికలలో జనసేన పార్టీ విజయం తథ్యమని ఆ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని మెలుపాక, యాదగిరి పాలెం గ్రామాలలో సోమవారం జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు తెలియజేస్తూ గాజు గ్లాసులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కన్నబాబు రాజు తన ఆస్తులను, వ్యాపారాలను కాపాడుకునేందుకు రాజకీయం నడుపుతున్నారు తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. వచ్చే ఎన్నికలలో జనసే పార్టీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, పైల అప్పలనాయుడు, టెక్కలి పరశురాం, కె చంద్రమోహన్, చొప్ప శ్రీను, పెంటకోట నరసింగరావు పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వివిధ దురాచారాల రూపుమాపిన ఉద్యమకారుల జీవిత చరిత్రలపై ఉపాధ్యాయులు కిల్లాడ ప్రసాదరావు గేయాలను ఆలపించి వివరించి ఉత్తేజపరిచారు. విద్యతో పాటుగా సమాజ సేవ, ఆవశ్యకతను గురించి విద్యార్థులకు బోధించారు. గ్రంథాలయాధికారి ఎల్వి రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకోటి దుర్గాప్రసాద్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేటలో నూతనంగా నిర్మించిన తాగునీటి బోరును సోమవారం జెడ్పిటిసి దొండా రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పిటిసి గ్రాంట్ నిధులను తాగునీటి వసతుల కోసం వెచ్చిస్తున్నట్లు చెప్పారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా గ్రామాలలో తాగునీటి బోర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యల్లపు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మొబైల్ అన్నా క్యాంటీన్ ప్రారంభం

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో నిర్వహణ... రూ.2కే భోజనం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సారధ్యంలో మొబైల్ అన్న క్యాంటీన్ సోమవారం ప్రారంభించారు. మున్సిపాలిటీలోని శ్రీ మరిడిమాంబ అమ్మవారి దేవాలయం వద్ద అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి మొబైల్ క్యాంటీన్ వాహనాన్ని ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, కౌన్సిలర్ రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి ప్రతీ రోజు అన్న క్యాంటీన్‌ను కొనసాగిస్తామన్నారు. ఎన్‌టిఆర్ రూ.2కే కిలోబియ్యం పథకాన్ని ప్రవేశపెడితే, చంద్రబాబు

వికలాంగునికి భోజనం అందిస్తున్న పద్మావతి

మొబైల్ అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తున్న అయ్యన్న సతీమణి

అన్నాక్యాంటీన్లు ప్రారంభించి పేదల ఆకలి తీర్చారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నాక్యాంటీన్లను మూసేసి, పేదలను పస్తులుండేలా చేశారన్నారు. ఈ నేపథ్యంలో రూ.2కే మొబైల్ అన్నాక్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం పెట్టాలని అయ్యన్న సంకల్పించారన్నారు కౌన్సిలర్ చింతకాయల రాజేష్ మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి ,సంక్షేమం జరగాలంటే అది అయ్యన్నకే సాధ్యమన్నారు. నాలుగున్నరేళ్లలో నర్సీపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు దనిమిరెడ్డి మధు, శ్రీకాంత్, రాజులు నాయుడు పాల్గొన్నారు

కాలుష్య రహిత ఎపికి సహకరించాలి

గో ఎలక్ట్రిక్ వాహనాన్ని ప్రారంభిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : కాలుష్య రహిత ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడానికి అందరూ సహకరించి, భావితరాలకు బంగారు భవిష్యత్తును అందిద్దామని నెడ్ క్యాప్ ఛైర్మన్ కె.కె.రాజు పిలుపునిచ్చారు. నెడ్ క్యాప్ విశాఖపట్నం విభాగం గో ఎలక్ట్రిక్ క్యాంపెయిన్ అవగాహన సదస్సును గురుద్వారా వద్ద ఉన్న ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ద్విచక్ర వాహన శ్రేణిలో ఏథర్ ఎనర్జీ, ఓలా ఎలక్ట్రిక్ టెక్నాలజీస్, హీరో ఎలక్ట్రిక్ వెహికల్స్, టీవీఎస్ మోటార్స్, బూమా ఇన్నోవేటివ్ ట్రాన్స్‌పోర్ట్ సొల్యూషన్స్, కైనెటిక్ గ్రీన్ ఎనర్జీ అండ్ పవర్ సొల్యూషన్స్, విద్యుత్ కార్ల వాహన శ్రేణిలో ఎమ్‌జి మోటార్స్ తదితర కంపెనీలకు చెందిన విద్యుత్ వాహనాల ప్రదర్శన ఏర్పాటుచేశారు. వాటి వినియోగ ఆవశ్యకత, ప్రయోజనాల గురించి సంస్థ ఉద్యోగులకు, వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, విద్యుత్ వాహనాల వినియోగం ద్వారా పర్యావరణాన్ని

అర్బన్ డీటీగా త్రినాథ్

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధార అర్బన్ తహశీల్దార్ కార్యాలయం డీటీగా ఎస్.ఎ.త్రినాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్జీ దారుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. అనంతరం ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చెరువు అభివృద్ధి పనుల పరిశీలన

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారిని

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో అమృత సరోవర చెరువుల అభివృద్ధి పనులను మండల ప్రత్యేక అధికారిని రమామణి సోమవారం పరిశీలించారు. డొంకాడ, చీడిక, కాగిత ,ఉపమాక పంచాయతీ శివారు మనబాలవానిపాలెం ,సారిపల్లిపాలెం గ్రామాల్లో అమృత సరోవర చెరువులలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు .ఉపాధి హామీ పథకం ద్వారా చెరువుల అభివృద్ధి పనులను పక్కాగా చేపట్టాలని స్థానిక అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీతారామరాజు ,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

అంగన్వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి- నక్కపల్లి : పాయకరావుపేట నియోజక వర్గం పరిధిలోని నాలుగు మండలాల్లోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడీ కేంద్రాల్లో 8 ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయినట్లు సిడిపిఒ శ్రీవిద్య సోమవారం ప్రకటనలో తెలిపారు .కోటవురట్ల మండలం రామచంద్రపురం, పాయకరావుపేట మండలం అరట్లకోట, నక్కపల్లి మండలం గొడిచెర్ల, ఎస్ రాయవరం మండలంలో నీల రామభద్రపురం, చినగుమ్ములూరు,పెద్ద గుమ్ములూరు, ఎస్ రాయవరం వెంకటనగరం గ్రామాల్లోని అంగన్వాడీ సెంటర్లలో ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. పూర్తి వివరాలకు ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

జోగంపేటలో గడపగడపకూ ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-గొలుగొండ : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వైసిపి పాలనలోనే అందిస్తున్నామనిఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. సోమవారం జోగంపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. సమస్యలను తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ లబ్ది అందకుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సుర్ల వెంకట

సంక్షేమ పథకాల బ్రోచర్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే గణేష్

గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, వైస్ ఎంపిపి జక్కు నాగమణి, సర్పంచ్ జువ్వల లక్ష్మి, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, మండల సచివాలయం కన్వీనర్ల అధ్యక్షులు పాని శాంతారావు, కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఎసిసి అధ్యక్షులు కొల్లు సత్యనారాయణ, నాగపురం సర్పంచ్ రఘురాం, లింగంపేట సర్పంచ్ సంతోష్, గుండుపాల రామకృష్ణ, కొమిర సర్పంచ్ రాజు, పత్తి రమణ, వైసిపి అధికార ప్రతినిధి జక్కు స్వామినాయుడు పాల్గొన్నారు.

గడపగడపకూ ఆహ్వానం లేదు...

జోగంపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి తమకు ఎటువంటి ఆహ్వానం లేదని జోగంపేట సీనియర్ వైసిపి నేతలు, మాజీ సర్పంచ్ చిటికెల వరహాలబాబు, ఉప సర్పంచ్ లాలం స్వామినాయుడు అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు గాని, గ్రామస్థాయి నాయకులు, సర్పంచ్, ఎంపిటిసి గాని ఎవరూ తమను ఆహ్వానించలేదన్నారు. సమాచారం ఇవ్వలేదన్నారు. వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న తమను విస్మరించడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి -కోటవురట్ల : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడంలో అధికారులు నిర్లక్ష్యం చూపరాదని స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు సోమవారం పాములవాక శివారు సుర్లవానిపాలెం, కన్నురుపాలెం, భీమిరెడ్డిపాలెం, గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా గ్రామాలలో సంక్షేమ పథకాలు అందుతున్న తీరు వివరాలు అడిగి తెలుసుకున్నారు గ్రామస్తులు తాగునీటి, విద్యుత్తు, డ్రైనేజీ సమస్యలను విన్నవించగా, పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయింపునకు

ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న వైసిపి అధ్యక్షులు శ్రీనివాసరావు

హామీనిచ్చారు. వైసిపి మండల అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైస్ ఎంపిపి దత్తుడు రాజు, స్థానిక సర్పంచ్ సత్యవతి, ఎంపిడిఒ చంద్రశేఖర్, తాహసిల్దార్ జానకమ్మ పాల్గొన్నారు.

చెరువులో అక్రమ నిర్మాణాలు తొలగించాలి

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని యు.చీడికాడ రెవెన్యూ పరిధిలో పల్లావూరు గ్రామాన్ని ఆనుకొని ఉన్న ఫాట్ చెరువులో అక్రమ నిర్మాణాలు తొలగించాలని సిహెచ్.నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురామ్ సోమవారం ఇన్‌చార్జ్ తహశీల్దార్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ చెరువును కొన్నేళ్లుగా ఎటువంటి మరమ్మత్తులు చేయకపోవడం వలన తుప్పలు పూడికలు సాగునీరు నిల్వ ఉండే పరిస్థితి లేదన్నారు. దీంతోపాటు ఇటీవల కాలంలో తారురోడ్డును ఆనుకొని కొందరు ఇళ్లను నిర్మించుకుంటూ, ఇళ్ల వెనుక భాగంలో ఉన్న చెరువును కప్పి, యథేచ్ఛగా నిర్మాణాలు చేస్తున్నారన్నారు. గతంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఆయకట్టు రైతులు ఎల్.లోవరాజు, గంట్ల బుజ్జి, పల్లా వరహాలబాబు ఉన్నారు.

వినతిపత్రం ఇస్తున్న ఆయకట్టు రైతులు

15 గ్రామాల్లో భూమి విలువ పెంపు

ప్రజాశక్తి -కోటవురట్ల : మార్కెట్ ధరలకు అనుకూలంగా భూమి విలువ పెంచిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా తమ కార్యాలయ పరిధిలో కోటవురట్ల, మాకవరపాలెం, నాతవరం, నర్సీపట్నం మండలాల్లోని 15 గ్రామాలకు భూమి విలువ పెంచారని సబ్‌రిజిస్ట్రార్ నరసింహమూర్తి తెలిపారు. ఆయా మండలాల పరిధిలో 72 గ్రామాలలో క్రయ విక్రయ లావాదేవీలు అత్యధికంగా జరుగుతున్నాయని, ఈ మేరకు వాటిల్లో 15 గ్రామాల్లో భూమి విలువ పెంచడం ద్వారా 20 నుంచి 40 శాతం వరకు అధిక ఆదాయం సమకూరనుందన్నారు. కోటవురట్ల మండలానికి సంబంధించి కోటవురట్ల, తంగేడు, కైలాస పట్నం, పందూరు, మాకవరపాలెం మండలానికి బోయినపాలెం, తామరం, వజ్రగడ, కొండల అగ్రహారం, జీ.గంగవరం, నర్సీపట్నం మండలంలో ధర్మసాగరం, వేములపూడి, నాతవరం మండలంలో మునగపూడి, బెన్నవరం, నాతవరం, శంగవరం, ఎల్లవరందొండపేట, గ్రామాలలో భూమి విలువ పెరిగింది

పిల్లలను యాచకులుగా మారిస్తే చట్టపరమైన చర్యలు

యాచక బాలల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : బాలకార్మిక వ్యవస్థ, చిన్నారులతో వెట్టిచాకిరీ, యాచించే చర్యలు చేపట్టడం దుర్మార్గం, చట్టరీత్యా నేరమని కార్మికశాఖ సహాయ అధికారి వి.సురేష్ అన్నారు. సోమవారం బాలల యాచన నిర్మూలనలో భాగంగా సహాయ కార్మిక అధికారి వి నరేష్ ఆధ్వర్యంలో పోలీస్, ఐసిడిఎస్ శాఖలు, చైల్డ్ లైన్, సీడ్ ఆర్గనైజేషన్‌తో కలిసి మండలంలో అడ్డరోడ్డులో బాల యాచకులను గుర్తించి వాళ్ళ తల్లిదండ్రులకు అవగాహన కలిపించారు. పిల్లల్ని యాచకులుగా మార్చి వారి భవిష్యత్‌ను ఎందుకు నాశనం చేస్తున్నారని ప్రశ్నించారు. పిల్లల చదువుకు, వారికి పోషకాహారం పంపిణీకి ప్రభుత్వపరంగా చేపడుతున్న చర్యలు వివరించారు. దీన్ని మొదటితప్పుగా భావించి విడిచిపెడుతున్నామని, మళ్లీ పిల్లలతో యాచక వృత్తిని కొనసాగిసేత చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలను హాస్టల్స్, పాఠశాలల్లో చేర్పిస్తామని సహకరించాలని కోరారు.

అల్లూరి పార్కును అభివృద్ధి చేయలేదనడం అవివేకం

ప్రజాశక్తి-గొలుగొండ : ఎల్‌పురంలోని అల్లూరి పార్కును అభివృద్ధి చేయలేదనిటిడిపి మాజీ జెడ్‌పిటిసి చిటికెల తారకవేణుగోపాల్ ఆరోపించడం అవివేకమని ఏఎల్‌పురం ఎంపిటిసి చింతల బుల్లిప్రసాద్ అన్నారు. అల్లూరి పార్కు సంరక్షకులకు ఔట్‌సోర్సింగ్ ద్వారా ఉద్యోగ కల్పన ఎమ్మెల్యే సహకారంతో చేశారన్నారు. ప్రస్తుతం వారికి నెలకు రూ.12వేల జీతం అందుతోందన్నారు. జెడ్‌పిటిసిగా ఉన్నపుడు ఏం చేయలేని వేణుగోపాల్, ఇపుడు ఇలా ఎదురు ఆరోపణలు చేయడం తగదన్నారు. ఎంపిటిసి కృష్ణ పాల్గొన్నారు.

గంజాయి పరిశీలన

ప్రజాశక్తి-గొలుగొండ : కేడీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 13కేసుల్లో పట్టుబడిన 308 కిలోల గంజాయిని అనకాపల్లి జిల్లా ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి కె.శ్రీ నివాసరావు సోమవారం పరిశీలించారు. పట్టుబడిన గంజాయిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో దగ్ధం చేయనున్న నేపథ్యంలో వాటి నిల్వలను పరిశీలించి, తూకం వేసి రికార్డులతో సరిపోల్చారు. కార్యక్రమంలో కేడీపేట ఎస్ఐ ఉపేంద్ర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు పోటీలు

ప్రజాశక్తి-గొలుగొండ : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో పుస్తక పఠనం, కథలు చెప్పడం, పర్యావరణంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 11 మంది పాల్గొన్నారు.

నేడు మోదకొండమ్మ పండగ

- ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ
- అడుగడుగునా స్టేజీల్లో వినోద కార్యక్రమాలు
- సేవా కార్యక్రమాలతో ఊరంతా సందడే సందడి

మాడుగుల మోదకొండమ్మ ఆలయం

ప్రజాశక్తి- మాడుగుల : భక్తుల ఆరాధ్య దైవం మాడుగుల మోదకొండమ్మ పండగ ఈనెల 6న మంగళవారం జరగనుంది. ఏళ్లతరబడి ఆనవాయితీగా నిర్వహిస్తున్న వేడుకలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. .మాడుగుల మోదకొండమ్మకు ప్రత్యేక చరిత్ర ఉంది. వందల ఏళ్లక్రితమే మాడుగుల ప్రాంతాన్ని పాలించిన ఒడిశా రాజులు అప్పట్లోనే అమ్మవారిని భక్తిగా కొలిచేవారని చరిత్ర చెబుతోంది. మొదట కోటలో రాజులు అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఇక్కడి నుండి ఏజన్సీ ప్రాంతానికి ఘటాలు తీసుకుని వెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహించేవారు .ఆ సమయంలో ఒకసారి సంస్థానాదీశలు ఏజెన్సీ ప్రాంతానికి చేరుకుని అమ్మవారికి పూజలు నిర్వహించి తిరిగి మాడుగుల చేరుకున్నారు .కానీ తిరిగి వచ్చే సమయంలో పూజసామగ్రితో పాటు బంగారు చెంబు మరచిపోయి తిరిగి వచ్చి విషయాన్నీ గ్రహించి మంత్రిని మినుములూరు ప్రాంతానికి వెళ్లి బంగారు చెంబు తీసుకురమ్మని ఆదేశించారట. .మంత్రి తిరిగి అక్కడికి చేరుకున్న సమయంలో అమ్మవారు తన అక్కాచెల్లెళ్లతో మాట్లాడుతున్నారని, మరిచిపోయిన బంగారు చెంబు విషయమై చెప్పేసరికి అమ్మవారు ఆగ్రహంతో ఆ చెంబు తన్నగా ప్రస్తుతం మాడుగులలో ఉన్న దేవాలయం వద్ద పడిందని, దీంతో రాజులు అక్కడ చిన్నపాటి గుడిని నిర్మించారని పూర్వీకుల కథనం. అప్పటి నుండి దశల వారీగా ఆలయం అభివృద్ధి చెందింది.

కొన్నేళ్ల క్రితం మాడుగుల తహసీల్దార్‌గా పనిచేసిన అంపన్న ఆలయ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. పురాతనమైన చిన్న దేవాలయం స్థానంలో అతిపెద్ద దేవాలయం నిర్మించడానికి గ్రామస్తుల సహకారం తీసుకున్నారు. దీంతో అప్పట్లో మాడుగులకు చెందిన వ్యాపారులు విరాళాలతో అమ్మవారి ఆలయం నిర్మాణం జరిగింది .కాగా రాష్ట్రంలో అనేక గ్రామదేవతలు గ్రామదేవతల ఆలయాలు ప్రసిద్ధి చెందినప్పటికీ మాడుగుల అమ్మవారి విగ్రహం ప్రత్యేకత సంతరించుకుంది .చోడవరానికి చెందిన శిల్పి ఎల్లయ్య అమ్మవారి విగ్రహాన్ని ఎంతో ఆకర్షనీయంగా రూపొందించారు. ఆమె చల్లటి చూపుతోనే గ్రామస్తులు ఆనందంగా ఆయురారోగ్యాలతో జీవిస్తున్నారని భక్తుల నమ్మకం. తిరుమల శ్రీవారి దర్శనాల మాదిరిగానే మాడుగుల అమ్మవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య ఇటీవల పెరిగింది. అమ్మవారికి ఆది,మంగళ వారాలు ఇష్టం కావడంతో ఈ రెండు రోజుల్లో అనేక దూర ప్రాంతాల నుండి భక్తులు అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో విచ్చేస్తున్నారు.

మోదకొండమ్మ అమ్మవారు, మూలవిరాట్

శతకంపట్టు వద్ద ఏర్పాట్లు

అమ్మవారి పండగకు నెల రోజుల ముందు, ఆలయం వద్దనుండి అమ్మవారి పాదాలు ఘటాలు ఊరేగింపుగా తీసుకొని కోట ఆవరణలో ఉన్న శతకంపట్టు వద్ద కొలువు ఏర్పాటు చేస్తారు. నెల రోజులపాటు అమ్మవారు కొలువు పూర్తి అయిన తర్వాత తిరిగి ఊరేగింపుగా వెళ్లి పాదాలు ఘటాలు ఆలయం వద్ద ఉంచుతారు దీంతో పండగ పూర్తయినట్టే

భారీ సాంస్కృతిక కార్యక్రమాలు

అమ్మవారి పండగ సందర్భంగా ఈ ఏడాది భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు పది రోజుల ముందు నుండే ప్రారంభమైన వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆహ్వాన పరిషత్ నాటికలతో పాటు గురువారం నుండి సురభి నాటకాలు ప్రారంభం అయ్యాయి పండగ మరునాడు సైతం సురభి నాటక ప్రదర్శన జరగనుంది. ఇక పండగ రోజు గ్రామంలోని దుర్గాలమ్మ గుడి వద్ద డీపండు మాస్టర్, తేజస్విని, రాజు బృందం ముంబై కళాకారుల డ్యాన్స్ 2023, దసరా స్టేజి వద్ద ఎంఎం దాస్ వీరాభిమన్యు బుర్రకథ, నంతరం బిక్కవోలు రాంబాబు, అవతార్ నాయుడుల గయోపాఖ్యానం యుద్ధసీను, ఎం.వీర్రాజు, గున్న బాబుల సత్య హరిశ్చంద్ర నాటకం, దాసరి వీధి వద్ద డ్యాన్స్ హంగామా, జవ్వాది గెడ్డ జంక్షన్ వద్ద ప్రేమ్ కుమార్ ఆర్ట్స్ సినీ నృత్య ప్రదర్శన, గవర వీధి వద్ద డ్యాన్స్ మస్తీ, జగ్గన్న చావిడి వద్ద డ్యాన్స్ డ్యాన్స్, రావి చెట్టు జంక్షన్ వద్ద డ్యాన్స్ ఉత్సవ్, శ్రీనివాస థియేటర్ వద్ద జబర్దస్త్ కళాకారుల డాన్స్ బేబీ డాన్స్, పండగ మరునాడు సురభి వారి మాయాబజార్ నాటకం, పండగ రోజు జవ్వాది గెడ్డ జంక్షన్ వద్ద తోలుబొమ్మలాట కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

భక్తులకు సేవా కార్యక్రమాలు

మోదమ్మ పండుగకు వేలాదిగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా పలు సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పెట్రోల్ బంక్ వద్ద పెరుమాళ్ళ శివయ్య జ్ఞాపకార్థం మరి కుమారుడు వెంకటరావు పోలిశెట్టి భోజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మాడుగుల ఆధ్వర్యంలో దుర్గాలమ్మ గుడి వద్ద అన్న ప్రసాద వితరణ, అమ్మవారి గుడి వద్ద మోదమాంబ టూర్స్ అండ్ ట్రావెల్స్ గంద్రేటి అప్పారావు కుమారుడు రమేష్ సురేష్ జగదీష్ ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ, కొట్యాడ శ్రీరామమూర్తి, సన్యాసమ్మ దంపతుల ఆశీస్సులతో కొట్యాడ రమేష్ అరుణ దంపతుల ఆధ్వర్యంలో ప్రసాదం, మజ్జిగ పంపిణీ, స్థానిక శ్రీరామ మెడికల్ షాప్ వద్ద శ్రీనాధు రామమూర్తి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు గ్లూకోజ్ పంపిణీ, మారిశెట్టి సీతారాం,శిరీష దంపతుల ప్రసాదం పంపిణీ, రావి చెట్టు జంక్షన్ వద్ద భీమరసెట్టి పైడినాయుడు, శతకంపట్టు వద్ద విశాఖ డెయిరీ అధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేయనున్నారు.

అమ్మవారి సారె ఊరేగింపు

మాడుగుల: మోదకొండమ్మ పండగ సందర్భంగా గ్రామంలోని పలు వీధులకు చెందిన భక్తులు అమ్మవారి సారేను ఘనంగా ఊరేగించారు. కొబ్బరితోట వీధికి చెందిన భక్తులు అమ్మవారికి తీర్థప్రసాదాలు ఘటాలతో భారీ ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి ముడుపులు చెల్లించుకున్నారు. పార్వతీ పరమేశ్వరులు, బుద్ధి వినాయక సేవా సంఘం, నైన్ బుల్లెట్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది

అమ్మవారి సారె ఊరేగిస్తున్న భక్తులు, గ్రామస్తులు

శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ అమ్మవారి పండుగ మహోత్సవ శుభాకాంక్షలు

చల్లని తల్లి, కోర్కెలు తీర్చే కల్పవల్లి
శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ తల్లి
జాతరకు విచ్చేయుచున్న
అశేష భక్తజనావళికి
హృదయపూర్వక
స్వాగతాంజలి

పుప్పాల అప్పలరాజు గారు
ఆలయ కమిటీ ఛైర్మన్

దంగేటి సూర్యారావు సభ్యులు	శ్రీనాధు శ్రీనివాసరావు సభ్యులు	భీమరశెట్టి పైడినాయుడు సభ్యులు

శ్రీ మోదకొండమ్మ ఆలయ కమిటీ సభ్యులు-వి.మాడుగుల

తుమ్ము పాపయ్యమ్మ	చింతాడ శ్రీనివాసరావు
పల్లేల సత్యవతి	బలిరెడ్డి అప్పలరాజు
దాడి అవినాష్	ధరిమిశెట్టి అప్పారావు
కోసిరెడ్డి అప్పారావు	చిక్కాల చినరాజు
కొట్యాడ మల్లిఖార్జునుడు	ద్రాక్షారపు అచ్యుత్‌రావు
మైచర్ల రాజారావు	పొట్నూరి కుమార్
నందారపు రవితేజ	కర్రి సత్యవతి
బెజవాడ రాజేష్	కుప్పిలి భవాని శంకర్

వి.మాడుగుల, అనకాపల్లి జిల్లా.

శ్రీశ్రీశ్రీ మోదమాంబ అమ్మవారి జాతర మహోత్సవ శుభాకాంక్షలు

శ్రీ మోదమాంబఅమ్మవారి జాతరకు విచ్చేయుచున్న భక్తులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హార్దిక శుభాకాంక్షలు

కర్రి సత్యవతి భర్త మంగరాజు (హల్వా)
ఆలయ కమిటీ మెంబర్
వి.మాడుగుల, అనకాపల్లి జిల్లా.

శ్రీశ్రీశ్రీ మోదమాంబ అమ్మవారి జాతర మహోత్సవ శుభాకాంక్షలు

శ్రీ మోదమాంబఅమ్మవారి జాతరకు విచ్చేయుచున్న భక్తులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హార్దిక శుభాకాంక్షలు

కె.కొండలరావు జాంటి ఫోటో స్టూడియో
వైయస్ఆర్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్
మరియు సచివాలయం-3 కన్వీనర్
వి.మాడుగుల గ్రామం, వి.మాడుగుల మండలం, అనకాపల్లి జిల్లా.

శ్రీశ్రీశ్రీ మోదమాంబ అమ్మవారి జాతర మహోత్సవ శుభాకాంక్షలు

శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ పండుగకు విచ్చేయుచున్న అశేష ప్రజలకు, నాయకులకు, అధికారులకు, మిత్రులకు, భక్తలకు, శ్రేయోభిలాషులకు అమ్మవారి కరుణ కటాక్షములు కలగాలని కోరుకుంటూ...

పుట్టా నారాయణమూర్తి
జనరల్ మర్చంట్, వి.మాడుగుల గ్రామం,
వి.మాడుగుల మండలం, అనకాపల్లి జిల్లా.

శ్రీశ్రీశ్రీ మోదమాంబ అమ్మవారి జాతర మహోత్సవ శుభాకాంక్షలు

వి.మాడుగుల శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ పండుగకు విచ్చేయుచున్న అశేష ప్రజలకు, నాయకులకు, అధికారులకు, మిత్రులకు, భక్తలకు, శ్రేయోభిలాషులకు అమ్మవారి కరుణ కటాక్షములు కలగాలని కోరుకుంటూ...

మాజీ సర్పంచ్
స్వర్గీయ మండల
జయశ్యామలరావుగారు
కుమారుడు - కోడలు

మండల వాసు
సాహితి టర్మరిక్ పాలిసింగ్ అండ్ అగ్రో ప్రాసెసింగ్ యూనిట్
సెల్: 9490389996, 9885207996

మండల సంతోషి సుబ్బలక్ష్మి (సునీత)
బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

వి.మాడుగుల గ్రామం, అనకాపల్లి జిల్లా.